ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కర్ణాటక వార్తలు
సోమవారం 29 జూలై 2024

ఆగస్టు రెండోవారంలో సీఎం జనస్పందన

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు రెండోవారంలో ముఖ్య మంత్రి సిద్దరామయ్య జనస్పందన నిర్వహించనున్నారు. ఇటీవలే బెంగళూరు విధానసౌధలో ఏర్పాటు చేసిన జనస్పందనకు వేలాదిమంది వచ్చిన విషయం తెలిసిందే. ఆగస్టు రెండోవారం లేదా స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత కలబురగిలోని యూనివర్సిటీ ప్రాంగణంలో జనస్పందన ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంకఖర్గే ఆదివారం స్థల పరిశీలన చేశారు. ఉత్తరకర్ణాటక ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉండాలనే జనస్పందన ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు.


కంప్లికోటలో ప్రవేశించిన నీరు

మూడు వారాలుగా
వర్ష బీభత్సం

- నీట మునిగిన పల్లెలు
- విరిగిపడుతున్న కొండచరియలు
- పలుచోట్ల స్తంభించిన రాకపోకలు
- సీఎం, కేంద్రమంత్రి పర్యటించినా పట్టించుకోని మంత్రులు
- కేబినెట్‌లో సీఎం ఆగ్రహం
- సామాన్యుల జీవనం అస్తవ్యస్తం

కేబినెట్‌లో సీఎం ఆగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా వానలు, వరదలు తీవ్ర ప్రభావం చూపుతున్నా ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత జిల్లాలకు వెళ్లకపోవడంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ జిల్లాలో పరిస్థితిని ఎప్పుడు సమీక్షించారు, అక్కడ పరిస్థితి తెలుసుకుంటున్నారా..? ఎంత మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారో మీదృష్టికి వచ్చిందా? అని ప్రశ్నించారు. కోట్ల రూపాయల నష్టం వచ్చిందని, పలు ప్రమాదాల్లో రైతులు, కూలీలు మృతి చెందారని ఇటువంటి క్లిష్ట సమయంలో స్పందించకపోతే ఎలాగని నిలదీసినట్టు సమాచారం. మీ జిల్లాలను సందర్శించాలని, అక్కడి సమస్యలు తనదృష్టికి తేవాలని సూచించినట్టు తెలుస్తోంది.


శిరూరు ఘటన ప్రదేశాన్ని సందర్శించిన సీఎం సిద్దరామయ్య (ఫైల్)


సకలేశపుర తాలూకాలో కేంద్ర మంత్రి కుమారస్వామి పర్యటన (ఫైల్)

మంత్రివర్యా.. ఇటు చూడండయ్యా..!

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మూడు వారాలుగా రాష్ట్రంలో వరుణుడు బీభత్సం కొనసాగుతోంది. భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. ఇక్కడ కొంత ప్రభావం తగ్గిందని భావిస్తున్న నేపథ్యంలోనే పొరుగున ఉండే మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో కుంభవృష్టి కొనసాగుతోంది. ఈ పరిణామంతో వరద పోటెత్తుతోంది. రాష్ట్రంలోని ఆరేడు జిల్లాలు మినహాయిస్తే వర్షబీభత్సంలో సామాన్యులు తల్లడిల్లుతున్నారు. తీరప్రాంత జిల్లాలు, దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి, పశ్చిమకనుమలకు అనుబంధమైన చిక్కమగళూరు, శివమొగ్గ, కొడగుతోపాటు మహారాష్ట్ర వరద ప్రభావం కల్గిన బెళగావి, బాగల్కోటె, బిజాపూర్, రాయచూరు, యాదగిరి జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో వందలకొద్దీ వంతెనలు నీట మునిగాయి. ఎన్నో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కేరళ నుంచి వరద ప్రభావం తీవ్రంగా ఉండడంతో కావేరి నదికి అనుబంధమైన జలాశయాలకు పోటెత్తుతోంది. ఈ పరిణామం హాసన్ జిల్లా సకలేశపురలో పెను ప్రమాదసంకేతాలు ఇస్తోంది. ఇక్కడికి సమీపంలోనే శిరాడి ఘాట్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంతో బెంగళూరు నుంచి మంగళూరు వెళ్లేందుకు రోడ్డుమార్గమే స్తంభించింది. తాజాగా రెండు రోజుల కిందట ఇదే ప్రాంతంలో రైల్వేట్రాక్‌పైకి చెట్లు, మట్టి కూలడంతో రైళ్ల సంచారానికి అంతరాయం ఏర్పడింది. ఇక బెంగళూరు నుంచి మంగళూరు వెళ్లాలంటే విమాన సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తాజాగా రైల్వేట్రాక్ పునరుద్ధరించినా రెండుమూడు రోజులపాటు అంతరాయం కొనసాగింది. కావేరి జలాశయాల నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీరు వదులుతుండడంతో శ్రీరంగపట్నం, రామనగర జిల్లా కనకపుర ప్రాంతాల్లో వరద బీభత్సంగా ప్రవహిస్తోంది. వందలాది ఇళ్లు నేలకూలాయి. వేలాది ఎకరాలలో పంటనష్టం జరిగింది. గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేక జనం ఉన్నచోటునే కాలయాపన చేస్తున్నారు. ఇంతటి విపత్కరమైన పరిస్థితి కొనసాగుతున్నా జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ఏం జరుగుతోందో స్వయంగా పరిశీలించే సాహసం చేయలేదు. కనీసం జిల్లాల పరిస్థితిని సమీక్షించేందుకు ఉత్సాహం చూపడం లేదు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని ఆరేడు జిల్లాల్లో తీరం, పశ్చిమ కనుమల పరిధిలోని ఏడు జిల్లాల్లో కావేరి నదీపరివాహక ప్రదేశాలైన మరో నాలుగు జిల్లాల్లో పరిస్థితి సమీక్షించి సహాయక చర్యలు తీసుకోవడంలో విఫలం చెందారని మంత్రులపై ప్రజలు మండిపడుతున్నారు. చిక్కమగళూరు జిల్లాలో దాదాపు నెలరోజులుగా వర్షం వల్ల నష్టాలు కొనసాగుతున్నాయి. కానీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కేజే జార్జ్ పరిశీలించిన దాఖలాలు లేవు. ఇక వైద్య విద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ అటు కలబురగి, ఇటు బెంగళూరుకే పరిమితమయ్యారు. బళ్లారి, విజయనగర జిల్లాల ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ అటువైపు వెళ్లనే లేదు. సాంస్కృతి శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న శివరాజ్ తంగడగి కొప్పళ జిల్లాలో పర్యటించలేదు. సొంత జిల్లాల్లో గడుపుతున్న బెళగావి సతీశ్‌జార్కిహోళి, చలువరాయస్వామి మండ్య, హెచ్‌కే పాటిల్ గదగ్, సంతోష్‌లాడ్ ధారవాడలో అందుబాటులో ఉన్నారు. కొడగును ఒకటిరెండు సార్లు మంత్రి బోసరాజు సందర్శించారు. బాగల్కోటెకు ఆర్‌బీ తిమ్మాపుర పలు మార్లు వెళ్లారు. దక్షిణకన్నడ మంత్రి దినేశ్‌గుండూరావు, ఉడుపి ఇన్‌చార్జి మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ఒకటిరెండుసార్లు సదర్శించారు. వరదలు మూడువారాలుగా కొనసాగుతుంటే బాధితులను పరామర్శించకుండా చుట్టపుచూపుగా ఆలయాలు సందర్శించేందుకు వచ్చారా..? అంటూ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌పై ఉడుపి జిల్లా ప్రజలు తిరగబడ్డారు.

మంత్రులు జిల్లాలకు వెళ్లండి : డీసీఎం

మంత్రులు జిల్లాలకు వెళ్లాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సూచించారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో పర్యటించాలని, అత్యవసర సౌలభ్యాలు సమకూర్చాలని సహచర మంత్రులకు సూచించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఈసారి భారీగా వర్షాలు కురుస్తున్నాయని, నదులు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలు ఆస్తులు, పశువులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి క్లిష్ట సమయంలో ప్రజలకు భరోసాగా నిలవాల్సిన బాధ్యత ఉందని సూచించినట్టు తెలిపారు. ప్రవాహ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు స్పందించాలని, అవసరమైన సౌలభ్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.


కలాస - హొరనాడు మార్గంలో హెబ్బాళ బ్రిడ్జి వద్ద ఆంక్షలు


కొడగు జిల్లా సోమవారపేట తాలూకాలో కొండచరియ రోడ్డుపై కూలడంతో వాహన సంచారానికి అంతరాయం

శిరూరుగుడ్డ ప్రమాదంపై ఆలస్యంగా రంగంలోకి..

ఉత్తరకన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరుగుడ్డలో కొండచరియలు విరిగిపడి 11మంది మృతి చెందిన సంఘటనలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రమాదం జరిగిన రోజే స్థానిక బీజేపీ ఎంపీ విశ్వేశ్వరహెగ్డే కాగేరి ఘటనా స్థలాన్ని సందర్శించారు. మరుసటి రోజు కేంద్రమంత్రి కుమారస్వామి వెళ్లారు. అక్కడి అధికారులతో కలిసి సమీక్ష జరిపారు. ఆ తర్వాతి రోజు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంకాళవైద్య వెళ్లారు. కేంద్రమంత్రి స్పందించి సంఘటనా స్థలానికి వెళ్లినా రాష్ట్రం నుంచి ప్రతినిధులు వెంటనే వెళ్లకపోవడంపై విమర్శలకు దారితీసింది.

విజయశంకర్‌కు ఉన్నత హోదా

- మేఘాలయ గవర్నర్‌గా మైసూరువాసి
- ఎమ్మెల్యే నుంచి అత్యున్నత స్థాయికి..



బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిమెంటు వ్యాపారంతో జీవితాన్ని ప్రారంభించి ఆ తర్వాత ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా రాణించి అత్యున్నతమైన గవర్నర్ హోదాకు ఎదిగారు మైసూరుకు చెందిన సీహెచ్ విజయశంకర్. బీజేపీ భావాలతో రాజకీయాల్లోకి వచ్చినా ఐదేళ్ల కిందట తనకు అన్యాయం జరిగిందని పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. మైసూరు లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఏడాది తిరక్కుండానే కాంగ్రెస్‌లో ఇమడలేక సొంతపార్టీ కమలదళంలోకి చేరిన విజయశంకర్‌కు దాదాపు పదేళ్ల తర్వాత కీలకమైన పదవి వరించింది. హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా మాకనూరులో 1956 అక్టోబరు 21న జన్మించారు. బీఎస్సీ దాకా చదివాక చంద్రశేఖర హొన్నాబండార్ విజయశంకర్ మైసూరు జిల్లా హుణసూరుకు వలస వచ్చారు. అక్క సహకారంతో బావ చేస్తున్న సిమెంటు వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఆయన ఆశయం రాజకీయాలవైపు ఉండేది. 90వ దశకంలో కాంగ్రెస్‌లో చేరి కొన్ని రోజులకే బీజేపీ వైపు వచ్చారు. 1991లో హుణసూరు ఎమ్మెల్యే స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 1994లో సాధారణ ఎన్నికల్లో హుణసూరు నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నాలుగేళ్లకే 1998లో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. తర్వాత ఏడాది జరిగిన ఎన్నికల్లో మైసూరు రాజు శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడెయార్ చేతిలో ఓడిపోయారు. 2004లో ఒడెయార్‌ను ఓడించి రెండోసారి ఎంపీ అయ్యారు. ఐదేళ్లలో మైసూరు ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్‌తోపాటు పలు అభివృద్ధి పనులు చేశారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విశ్వనాథ్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశించారు. యడియూరప్పకు ఆప్తుడనే పేరుండేది. ఈ మేరకు ఎమ్మెల్సీని చేసి అటవీశాఖ, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రితోపాటు కొడగు, చామరాజనగర జిల్లాల ఇన్‌చార్జిగా అవకాశం కల్పించారు. యడియూరప్ప ముఖ్యమంత్రి పదవిని కోల్పోవడంతో 11నెలలు మాత్రమే విజయశంకర్ మంత్రిగా కొనసాగారు. 2013లో పెరియపట్టణ ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయాలని భావించారు. యడియూరప్ప అప్పట్లో సొంతంగా కేజేపీ పార్టీ ఏర్పాటు చేసినా విజయశంకర్ బీజేపీలోనే ఉన్నారు. 2014లో మైసూరుకు బదులుగా హాసన్ లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ అధిష్టానం అవకాశం ఇవ్వగా దేవెగౌడ చేతిలో ఓడిపోయారు. బీజేపీలో అన్యాయం జరిగిందని కాంగ్రెస్‌లోకి వెళ్లారు. 2019లో కాంగ్రెస్-జేడీఎస్ మైత్రి అభ్యర్థిగా మైసూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. ఏడాదిలోనే కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెనుతిరిగారు. 2023లో పెరియపట్టణ శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి చిత్తుగా ఓడిపోయారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినా అవకాశం రాలేదు. కాంగ్రెస్‌లో రాజకీయాలు ప్రారంభించి సుదీర్ఘకాలం బీజేపీలో పయనించి మళ్లీ ఏడాదిపాటు కాంగ్రెస్‌లోకి వెళ్లి తిరిగి బీజేపీలోకి వచ్చిన విజయశంకర్‌కు అవకాశం దక్కింది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేసిన విజయశంకర్‌కు మేఘాలయ గవర్నర్ హోదా వరించింది.

మళ్లీ సీఎం అవుతా..!

- రామనగర పేరు మారుస్తా
- డీసీఎం వ్యాఖ్యలపై కుమారస్వామి
- నంజనగూడులో కేంద్రమంత్రికి అవమానం

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'త్వరలోనే నేను మళ్లీ ముఖ్యమంత్రి అవుతా.. అప్పుడు ఖచ్చితంగా రామనగర జిల్లా పేరును యథాతథంగా మారుస్తా' అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. మైసూరు జిల్లా నంజనగూడులోని శ్రీకంఠేశ్వర ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుమార మీడియాతో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ నేతలు తనను సీఎం కాలేడని సవాల్ విసిరారని, అదేఅవధిలోనే తాను ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లభించిందన్నారు. శనివారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కుమారస్వామికి ముఖ్యమంత్రిగా రామనగర పేరు మార్చే అవకాశం నుదుటిపైన రాయలేదని వ్యాఖ్యానించారని, వారు ఏం మాట్లాడితే అదే జరుగుతుందని పేర్కొన్నారు. దేవుడి ఆశీర్వాదం ఉంటే తాను మళ్లీ ముఖ్యమంత్రి అవుతా అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి గ్రాంట్లు దక్కలేదనే ఆరోపణలను కొట్టిపారేశారు. నంజనగూడు ఆలయం దర్శించుకుని అతిథిగృహానికి వెళ్లగా తలుపులకు తాళాలు వేశారు. సుమారు పది నిమిషాలపాటు అక్కడ వేచి ఉన్నా ఎవరూ స్పందించలేదు. ముందుగా అధికారులకు సమాచారం ఇచ్చినా అందుబాటులో లేకపోవడంపై కుమార ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి పర్యటన ముందుగా అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని జేడీఎస్ నేత, మాజీ మంత్రి సా రా మహేశ్ మండిపడ్డారు. ఈమేరకు జిల్లా అధికారికి ఫిర్యాదు చేయగా నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసు


నంజనగూడు ఆలయంలో ప్రత్యేక పూజల్లో కేంద్రమంత్రి కుమారస్వామి


తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

చూసొద్దాం రండి..!

తుంగభద్ర జలాశయం వద్దకు తరలివస్తున్న పర్యాటకులు

బళ్లారి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. జలాశయం నుంచి నదికి నీరు ఉప్పొంగుతోంది. ఎగసిపడుతున్న జలాలు, చల్లటి వాతావరణం చూసి పర్యాటకులు పులకించిపోతున్నారు. రాష్ట్రంలో అత్యంత పెద్దదిగా ఉన్న తుంగభద్ర డ్యాంను తిలకించేందుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. బళ్లారి, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి తుంగభద్రను తిలకించేందుకు తరలి వచ్చారు. కొందరు రైతులు గంగపూజలు చేశారు. ఈ ప్రాంతంలోని రైతులు గంగపూజలు చేసి ఆ నీటిని బాటిల్లో తీసుకుని ఇంటికి వెళ్లి అక్కడ పూజలు చేసి పొలాల్లో చల్లుకుంటారు. అనంతరం ఉలిగమ్మ, హొసూరమ్మ, విరుపాక్షేశ్వర ఆలయాల్లో పూజలు చేశారు.


తుంగభద్ర జలాశయం వద్ద పర్యాటకుల సందడి

నేడు ఢిల్లీకి సీఎం, డీసీఎం

ముడా, వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై అధిష్టానానికి వివరణ..

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి)

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటిస్థలాల అవినీతిలో నేరుగా ముఖ్యమంత్రి కుటుంబంపై ఆరోపణలు, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల నగదు బదిలీ అక్రమాలలో పదే పదే రాహుల్‌గాంధీ పేరును ప్రతిపక్షాలు ప్రస్తావిస్తున్న తరుణంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ను అధిష్టానం ఢిల్లీకి పిలిచినట్టు తెలుస్తోంది. ఈ మేరకు వారిద్దరూ సోమవారం ఢిల్లీ వెళ్తున్నారు. కేఆర్‌ఎస్ జలాశయం పూర్తిగా నిండడంతో వాయనం సమర్పిస్తారు. అనంతరం ఢిల్లీ వెళతారు. వాల్మీకి కార్పొరేషన్ అవినీతి అంశాన్ని రాజ్యసభలో బీజేపీ సభ్యుడు ప్రస్తావించడం, రెండు అక్రమాలపైనా రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్లమెంటు భవనం ముందు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన అంశాలు దేశమంతటా ప్రచారమవుతున్న తరుణంలోనే ఢిల్లీ వెళ్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీని కలిసి రెండు అంశాలపైనా వివరణ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. మూడు రోజులపాటు ముఖ్యమంత్రి ఢిల్లీలోనే గడపనున్నారు. ముఖ్యమంత్రితోపాటు పలువురు మంత్రులు ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం.





మొబైల్ మంచి కోసం
వాడుకోవాలి

- శ్రీకృష్ణ కళాశాల స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ ఆనంద్‌కుమార్

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొబైల్ ఫోన్లను మంచికోసం ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియాలో చెడు ఆలోచనల నుంచి దూరంగా ఉండాలని బెంగళూరు సిటీ యూనివర్సిటీ వాల్యుయేషన్ రిజిస్ట్రార్ డాక్టర్ ఆనంద్‌కుమార్ సూచించారు. శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం శనివారం నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు అధ్యక్షత వహించగా సుప్రీంకోర్టు న్యాయవాది సందీప్‌పాటిల్, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పోటీ యుగంలో విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇచ్చి జ్ఞానాన్ని సంపాదించాలన్నారు. సమాజంలో తల్లిదండ్రులు, గురువులపట్ల గౌరవం ఉండాలన్నారు. దేశంలో ఎన్నోరంగాలలో రాణించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రూప్ పరీక్షల్లో పోటీ పడాలని పిలుపునిచ్చారు. సందీప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం కాకుండా జ్ఞానాన్ని పెంచుకునేందుకు పోటీ పడాలన్నారు. నైతిక విలువలు పాటించాలని, ప్రపంచంలోనే ఉద్యోగ రంగంలో భారతీయుల స్థానం గర్వపడేలా ఉందన్నారు. రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ బీకామ్, ఎంకామ్‌లను పూర్తి చేసిన వారికి పట్టాలను ప్రదానం చేసినట్టు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించినవారికి ప్రోత్సాహకాలను అందించారు. అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్వీ మనోహర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.


పట్టాల ప్రదానంలో ప్రముఖులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.09	1,619.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,24,361	1,07,118
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,50798	59
సామర్థ్యం (టీఎంసీలు)	98.22	59.00

40 టీఎంసీల వరదనీరు వృథా!


డ్యాం నుంచి నదిలోకి దూకుతున్న వరద నీరు

- సమాంతర, నవలి ప్రాజెక్టులతో ఉపయోగంలోకి రానున్న నీరు
- ఉంతకల్లు వద్ద తుంగభద్ర నీటి రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు
- చర్యలకు ఇంజినీర్లు, మేధావుల డిమాండ్

బళ్లారి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకునేలా చూస్తాం. పారే నీరు వృథాకాకుండా ఉపయోగంలోకి తెస్తామని అధికారులు. నాయకులు ఉపన్యాసాలు ఊదరకొడుతుంటారు. కానీ ఆచరణలో మాత్రం చుక్కకాదుకదా..కోట్లాది ఘనపుటడుగుల నీరు కళ్ల ముందే వృథా అవుతున్నా చూస్తూ ఊరుకుంటారు. ఒక్కఅడుగు కూడా ముందుకు వేయ లేక పోతున్నారు.

ఈ ఏడాది తుంగభద్ర డ్యాంకు నీరు నిండుగా చేరింది. పూర్తి స్థాయిలో డ్యాం నిండడంతో గేట్లు ఎత్తినదికి నీరు విడుదలచేశారు. ఇలా వారం రోజులుగా నీరును నదికి వదులుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఆదివారం సాయంత్రం వరకూ నదికి ఏకంగా 40 టీఎంసీల నీరు మళ్లించారు. అలాకాకుండా తుంగభద్ర జలాశయం నుంచి వర్షాకాలంలో నదిలోకి పారే ఈ వరదనీటిని ఉపయోగంలోకి తెచ్చుకుంటే రెండు రాష్ట్రాల రైతులకు ఉపయోగ కరంగా ఉంటుందని రాజకీయ నాయకులతో పాటు అధికారులు అభిప్రాయ పడుతున్నారు. కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రలోని అనంతపురం, కడప(వైఎస్సార్) జిల్లాల రైతులకు ఉపయోగపడేలా తుంగభద్ర ఎగువ కాలువకు డ్యాం నుండి సమాంతర కాలువ నిర్మాణం కోసం అనేక ఏళ్లుగా ప్రతిపాదనలు నలుగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రాల నీటి ప్రాజెక్టు కాబట్టి రెండు రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కర్ణాటక ప్రభుత్వం రాయచూరు జిల్లా నవలి గ్రామం వద్ద సుమారు 20 టీఎంసీల నీటి నిల్వ సామర్థంతో నవలి నీటి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గత బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో నవలి నీటిప్రాజెక్టు కోసం రూ. 540 కోట్లు(డీపీఆర్) కేటాయించింది. 2014లో టీడీపీ ప్రభుత్వం హెచ్చెల్సీకి సమాంతర కాలువను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. బళ్లారి జిల్లాకు సమీపంలో ఉండే రాయదుర్గం తాలూకా బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద తుంగభద్ర నీటి రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే, గృహనిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రతిపాదనలు పంపారు. రిజర్వాయర్‌ను ఉంతకల్లు వద్ద ఏర్పాటు చేస్తే ఈప్రాంతంలో ఉండే గ్రామాలకు తాగునీరు అందించడంతో పాటు రైతులకు సాగునీరు అందించవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎగువ కాలువకు సమాంతర కాలువ నిర్మాణం చేస్తే వరద నీరు వృథా కాకుండా ఇలాంటి రిజర్వాయర్లలో నిల్వ చేసి ఉపయోగంలోకి తీసురావచ్చని తెలుగుదేశం ప్రభుత్వం భావించింది. దీని సాధ్యాసాధ్యాలపై కేంద్ర జలవనరులశాఖ కూడా అధ్యయనం చేసి అంగీకరించాల్సి ఉంది.

తరిమెల నాగిరెడ్డికి ఘన నివాళి


నాగిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రైతులు

బళ్లారిరూరల్, జూలై 28 : ఆంధ్రలో అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో కమ్యూనిస్టు నాయకుడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కర్ణాటక రైతు రాష్ట్ర సంఘ అధ్యక్షులు మాధవరెడ్డి చాగనూరు మల్లికార్జున రెడ్డి నేతృత్వంలో జరుపుకున్నారు. వారు తరిమెల గ్రామానికి చేరుకుని ఆయన స్థూపానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. మధురెడ్డి మాట్లాడుతూ తరిమెల నాగిరెడ్డి కార్మికులకు అనుకూలంగా వుంటూ పోరాటాలు చేస్తూ ఎందరో పేదల గుండెల్లో నిలిచారన్నారు. జైలుకు వెళ్లినప్పటికీ పేదల కోసం నిరంతరం పోరాడుతూ మృతి చెందారన్నారు. 48 సంవత్సరాలు కావడంతో ఆయన సమాధికి పూలమాలలు నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో ఓంకార్ గౌడ్, శ్రీహరి, సలీమ్, ఝాన్సీ చంద్రన్న, రఘు వారితో పాటు రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి


పిల్లలతో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ

సిరుగుప్ప, జూలై 28 : పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని తాలుకా వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ సూచించారు. సిరుగుప్ప పట్టణంలో బుద్ధిమాంద్య పిల్లల వసతి పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడ హాస్టల్‌లోని సౌకర్యాలను ఆయన తెలుసుకున్నారు. ఈ వసతి పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారని, కనుక ఆ పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పాఠశాల ఛైర్మన్లకు సూచించారు. యూనిఫామ్‌లు, రోజు స్నానం చేయించడం అవసరమని ఆయన సూచించారు.

పరిపాలనలో విఫలమైన కాంగ్రెస్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, జూలై 28 : కాంగ్రెస్ పరిపాలన పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప తీవ్రంగా విరుచుకుపడ్డారు. సిరుగుప్ప పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో శనివారం బీజేపీకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గ్యారెంటీ పథకాల పేరిట అధికారం పొంది ఆ పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. సామాన్య ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, తాలుకా అధ్యక్షులు మల్లికార్జునస్వామి, జిల్లా యువమోర్చ అధ్యక్షులు ఎంఎస్ సిద్ధప్ప, నాయకులు మైకేల్ వీరేష, మహాదేవ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం


24వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

సిరుగుప్ప, జూలై 28: పట్టణంలోని 28వ వార్డులో రూ.పది లక్షల నగరసభ నిధులతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో గతంలోవున్న రోడ్డు పాడైపోవడంతో నగరసభ అధికారులు తక్షణం స్పందించి యంత్రాలతో రోడ్డుపనులకు శ్రీకారం చుట్టారు.

గంధపు చెట్టు నరుకుతున్న వ్యక్తి అరెస్ట్


అధికారులు అరెస్టుచేసిన నిందితుడు

బళ్లారి సిటీ, జూలై 28: సుశీలానగర్‌కు చెందిన ముతాలి నాయక్ అటవీ ప్రాంతంలో చెట్లను నరకుతుండగా, సండూర్ అటవీశాఖ అధికారులు అరెస్టు చేసి గంధపు చెక్కను స్వాధీనం చేసున్నారు. ఈ ప్రాంతంలో చందనం చెట్లను నరికివేస్తున్నట్లు సమాచారం ఉందని, అటవీశాఖ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా చెట్లను నరికివేస్తున్న శబ్దం వినిపించిందన్నారు. ఆసమయంలో నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టిన సిబ్బంది ముతాలి నాయక్‌ను అరెస్టు చేసి అతడి నుంచి సుమారు రెండు కిలోల గంధపు కలపను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచేందుకు తరలించినట్లు నార్త్‌జోన్ ఫారెస్ట్ ఆఫీసర్ సయ్యద్ దాదా ఖలందర్ తెలిపారు.

నీటమునిగిన పురందరదాసు మండపం

కంప్లి, జూలై 28: తుంగభద్ర జలాశయం నుంచి వరద ఆరు రోజులుగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. తుంగభద్ర జలాశయం నుంచి ఆదివారం 33 గేట్ల నుంచి 1,47,000 క్యూసెక్కులు నీరు నదికి వదిలారు. నదికి అత్యధిక ప్రమాణంలో నీరు రావడంతో హంపిలోని పురందరదాసు మండపం పూర్తిగా నీటిలో మునిగింది. అలాగే కంప్లి కోటలోకి నీరు ప్రవేశించాయి. అలాగే కంప్లి కోట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసిన తహసీల్దార్ శివరాజు, నోడల్ అధికారి దుర్గన్న, బసవరాజు, గణేష్, విరుపాక్షి, షణ్ముఖప్ప తదితర అధికారులు భారీ బందోబస్తు చేపట్టారు. అధికారులు రేయింబవళ్లు విధులు నిర్వహిస్తూ ఎలాంటి సంఘటనలు జరుగకుండా అప్రమత్తంగా చర్యలు చేపట్టారు.


తెప్ప ద్వారా పొలాలకు వెళ్తున్న రైతులు


నీటమునిగిన పురందరదాసు మండపం

నదికి భారీఎత్తున నీరు రావడంతో కంప్లి పట్టణం, గ్రామాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. రైతులు కూడా తెప్పల ద్వారా తమ పొలాలకు చేరుకుని పనుల్లో నిమగ్నమవుతున్నారు. నది ఒడ్డున వున్న బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, సూగూరు గ్రామాల్లో కూడా అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కంప్లి కోట వద్ద నీరు అత్యధిక స్థాయిలో రావడంతో ప్రయాణికులు గంగావతి, రాయచూరు, మాన్వి, సింధనూరు విద్యార్థులకు పెద్ద ఇబ్బందికరంగా మారింది. ప్రతి యేటా జలాశయం నుంచి నదికి నీరు పోటెత్తినప్పుడల్లా తమకు ఇబ్బందులు తప్పవని ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగ్గులో వున్న వంతెనను కాదని ఎత్తులో వంతెనను నిర్మించాలని కోరారు.

బోనులో చిక్కిన నల్లముచ్చు కోతి



కంప్లి, జూలై 28 : తాలుకా పరిధిలోని కొట్టాల గ్రామంలో ఆదివారం ఓ నల్లముచ్చు కోతి బోనులో పడింది. అది కొన్ని రోజులుగా గ్రామంలో పొలాలకు వెళ్లే రైతుల మీద, విద్యార్థుల మీద, గ్రామస్తుల మీద దాడి చేసి గాయపరిచేది. ఈ నల్లముచ్చు కోతి వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. గ్రామస్తులు అధికారులకు తెలపడంతో అధికారులు బోను ఏర్పాటు చేశారు. చివరకు ఆదివారం బోనులో పడింది. నల్లముచ్చు కోతి బోనులో పడటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కేజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాలసుబ్రహ్మణ్యం నాయుడు


బాలసుబ్రహ్మణ్యం నాయుడిని అభినందిస్తున్న ప్రజలు

బళ్లారిరూరల్, జూలై 28 : కేజేపీ బళ్లారి జిల్లా అధ్యక్షుడిగా బాల సుబ్రహ్మణ్యం నాయుడును నియమించినట్లు ఆ పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ భరద్వాజ్ తెలిపారు. బళ్లారి నగరం డీసీ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న పత్రిక భవన్ ఆవరణలో జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాల సుబ్రహ్మణ్యం నాయుడుకు నియామకపత్రాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు, పదాధికారులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాలకు చేరిన గోవులు

కంప్లి, జూలై 28 : కాలువలకు నీరు రావడంతో పశువుల కాపరులు మేత లేక కొండ ప్రాంతాలకు పశువులను మేపేందుకు వలస వెళ్లారు. బెల్గాం జిల్లా పరిధిలోని పశువుల కాపరులు మేత లేక ప్రతి యేటా కంప్లి ప్రాంతానికి వలస వచ్చి ఖరీఫ్, రబీ పంటల అనంతరం పొలంలోనే ఆవులను నిలుపుతూ రైతులు ఇచ్చినడబ్బుతో తమ జీవనం కొనసాగించేవారు. రైతులు సేంద్రియ ఎరువు కోసం పొలాల్లో ఆవులమందలను తోలుకునేవారు. కాని ప్రస్తుతం కాలువలకు నీరు రావడంతో పాటు ఇక్కడ మేతలేక పోవడంతో బుక్కసాగర, రామసాగర ప్రాంతాలకు వెళుతున్నారు. షెడ్లు ఏర్పాటు చేసుకుని అక్కడే మేత సేకరించి జీవనం కొనసాగిస్తున్నారు. ఖరీఫ్ పంటలు ముగిసిన అనంతరం తిరిగి కంప్లి పరిధిలోని పొలాల్లో ఆవులను నిలుపుతూ తమ జీవనం కొనసాగిస్తారు. అప్పటిదాకా అడవుల్లో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటుచేసి తమను ఆదుకోవాలని పశువుల కాపరులు కోరుతున్నారు. రాత్రివేళల్లో కొండగుట్టలపై తమ ప్రాణాలు అడ్డుపెట్టి జీవనం కొనసాగిస్తున్నామని వారు వాపోయారు.


బుక్కసాగర వద్ద కొండ ప్రాంతాల్లో మేస్తున్న గోవులు

కళలను కాపాడుకోవాలి

బళ్లారి సిటీ, జూలై 28: అనాదిగా వస్తున్న సాంప్రదాయ కళలను అంతరించిపోకుండా కాపాడుకోవాలసిన బాధ్యత మనందరిదని బైలాట అకాడమీ అవార్డు గ్రహీత రంగారెడ్డి పేర్కొన్నారు. అభినవ శకుంతలఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంగిరణ హాల్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారతీయ నృత్యం, బైలాట, తోలుబొమ్మలాట వీటిని ముందు తరాలకు అందించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించి ఈట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులు, రామచంద్ర, ప్రీతి, శ్వేతా, వైష్ణవి, బీమరావ్, శ్రీధర్,రాధకృష్ణ, శివరుద్రయ్య తదితరులను సత్కరించారు. అనంతరం నాగభూషణ బృందం ప్రదర్శించిన నృత్యరూపకం విశేషంగా అలరించింది. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సత్యనారాయణ, శోభ, గాయిత్రి, కళాకారులు పాల్గొన్నారు.

సిద్దరామయ్యపై ఆరోపణలు సహించం

కాంగ్రెస్ సీనియర్ నేత కల్లుకంబ పంపాపతి

బళ్లారి సిటీ, జూలై 28: అహింద నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ఎటువంటి కారణం లేకుండా ఆరోపణలు చేయడం సహించేప్రసక్తే లేదని కాంగ్రెస్ సీనియర్ నేత కల్లుకంబ పంపాపతి బీజేపీని హెచ్చరించారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప మాదిరిగానే ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా 40 ఏళ్లుగా రాజకీయాల్లో మచ్చలేకుండా జీవించారన్నారు. అలాంటి వ్యక్తి కారణం లేకుండా ముడా భూ కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించడం సరికాదన్నారు. ముడాలో కుంభకోణం జరిగితే విచారణలో తేలుతుందని, అప్పటి వరకు ప్రతిపక్ష పార్టీ మౌనంగా ఉండడం మంచిదన్నారు. బీజేపీ అధ్యక్షుడు అనవసరంగా సిద్దరామయ్యపై ఆరోపణలు చేసి నిరసన తెలిపితే సిద్దరామయ్య కోసం అహింద వర్గం ఐక్యంగా పోరాడుతుందని హెచ్చరించారు. వాల్మీకి కార్పోరేషన్ కుంభకోణంపై విచారణ జరుగుతోందని, దోషులకు శిక్షపడేలా ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో సిద్దరామయ్య గొప్పశక్తి అని అన్నారు. అందుకే ఆయన రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. దీని వెనుక ఆయన పోరాటం ఉందన్నారు. విలేకరుల సమావేశంలో బుడా మాజీ అధ్యక్షుడు ఎన్. ప్రతాప్‌రెడ్డి, పార్టీనాయకులు ఎల్.మారెన్న, మహ్మద్‌గౌస్, గాదిలింగనగౌడ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కల్లుకంబ పంపాపతి

వైద్యశిబిరం.. నిరుపేదలకు వరం

బళ్లారిరూరల్, జూలై 28: ఆస్మీ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో బళ్లారి తాళ్లూరు రోడ్డు రేణుకనగర్ 17వక్రాస్ సర్కారీ ప్రాథమిక హైస్కూల్ ఆవరణంలో మేయర్ నందీష్, ఉపమేయర్ భాను నేతృత్వంలో ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి పరీక్షలు నిర్వహించారు. ఉచిత ఆరోగ్య కేంద్రాల ద్వారా బలహీనవర్గాల వారు ఆరోగ్య పరీక్షలు చేయించు కునేందుకు అనుకూలంగా వుంటుందని మేయర్ నందీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కేశవ, భారతి, నంజమా బాను, కృష్ణ రజియా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మాజీ శాసనసభ్యులు

బళ్లారి సిటీ, జూలై 28: నగరంలోని 13వ వార్డు సభ్యుడు సి.ఇబ్రహీంబాబు ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర మాజీ శాసనసభ్యులు సోమశేఖర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మోత్కార్, 24వ వార్డు సభ్యుడు ఎస్.మల్లనగౌడ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

పీపుల్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సన్మానం


అత్యధిక మార్కులు సాధించిన శ్రీలంక తమిళ విద్యార్థులను సన్మానిస్తున్నదృశ్యం

హోసూరు(సిప్‌కాట్) జూలై 28: హోసూరు కెలవరపల్లి అనకట్ట ప్రాంతంలోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రంలో రాష్ట్రస్థాయిల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా హోసూరు హోసూరు జిల్లా తహసీల్దార్ విజయకుమార్, సిలోన్ తమిళ క్యాంపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అన్బు, డీఎంకే యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి పాల్గొని రాష్ట్ర స్థాయిల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పలు కళా కార్యక్రమాలు జరిగాయి. డీఎంకే నగర కోశాధికారి త్యాగరాజన్, కౌన్సిల్ ఇన్ చార్జీలు, కెలవరపల్లి డ్యాం క్యాంపు ఉపాధ్యాక్షురాలు శారదాదేవి, పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

హోసూరు జూలై 28: హోసూరు వాసవీ నగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరం ఆసుపత్రిలో ఉచిత వైద్య చి కిత్స నిర్వహించారు. మార్కిస్టు పార్టీ మున్సిపల్ కార్యదర్శి నిర్వాహితులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయరామన్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి ఆనందకుమార్ అందరికి స్వాగతం పలికారు. మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, శిభిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంల్లో వరం హాస్పిటల్ ఫౌండర్ రామమూర్తి డైరెక్టర్ డాక్టర్ ప్రియదర్శిని డాక్టర్స్‌తో 300 మందికి పైగా చికిత్స అందించారు.

75 ఏళ్ల వ్యక్తికి కాలేయ శస్త్రచికిత్స విజయవంతం

హోసూరు జూలై 28 : హోసూరు సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్‌లోని వైద్యులు 75 ఏళ్ల రక్తపోటు ఉన్నవ్యక్తికి కాలేయ క్యాన్సర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇది వైద్య కళాశాలల్లో మొదటిది. గ్యాస్ట్రోఇంటెస్టినల్ సర్జన్ డాక్టర్ తామరై కన్నన్, క్యాన్సర్ సర్జన్ డాక్టర్ శక్తీశ్వరన్, డాక్టర్ వేద, యశస్విని, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సారిక జనరల్ సర్జన్‌ల సంయుక్త కృషితో కాలేయ క్యాన్సర్ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల మెడికల్ డాక్టర్ రాజముత్తయ్య మాట్లాడుతూ, ఈ సర్జరీ సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్ సాధించిన గొప్ప విజయం అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితమైన రోగ నిర్ధారణ , ఖచ్చితమైన ప్రణాళికతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.వాసుదేవన్ మాట్లాడుతూ లివర్ క్యాన్సర్ వృద్ధ రోగులలో అదనపు సవాళ్లను కలిగిస్తుందన్నారు. తమ మల్టీడిసిప్లినరీ విధానం ఈ సంక్లిష్ట శస్త్రచికిత్స అత్యున్నత ప్రమాణాలతో జరిగిందని నిర్ధారిస్తుందన్నారు. రోగి ఇప్పుడు మంచి ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వెళుతున్నారని, ఆసుపత్రి చరిత్రల్లో ఇదో పెద్ద మైలురాయి అని అన్నారు.



సర్జరీ అనంతరం కోలుకున్నరోగి

ప్రభుత్వానికి, ప్రజలకు మీడియా వారధిగా ఉండాలి

రాయచూరు, జూలై 28: ప్రజాస్వామిక వ్యవస్థలో అత్యంత కీలక భూమిక పోషిస్తున్న పత్రికారంగం, మీడియా ప్రజలకు పాలకులకు మధ్య వారధిగా ఉండాలని రాష్ట్ర వైద్యవిద్యశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్ అన్నారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా కమిటీ జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేద్కర్ జగ్జీవన్ రామ్‌భవన్‌లో పత్రిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యవిద్య శాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్, స్వాతంత్ర్యానికి పూర్వ స్వాతంత్ర్యం అనంతరం పత్రిక రంగంలో వచ్చిన సమూల మార్పులను ప్రస్తావిస్తూ పాత్రికేయులు మరింత మెళకువగా తమ విధులు నిర్వహించాలన్నారు. సోషల్ మీడియా సవాలుతో పాటు కార్పోరేట్ చేతుల్లోకి పత్రిక రంగం వెళ్లడం వల్ల ఎదురవుతున్న సవాళ్లను పాత్రికేయులు సమర్థంగా ఎదురుకోవాలన్నారు. గతంలో ప్రజల అవసరాలు ప్రభుత్వాలకు ప్రాతిపదిగా కానుండగా ప్రస్తుతం పరిస్థితుల్లో కార్పోరేట్ శక్తులు తమ అవసరాలను ప్రజాఅవసరాలుగా చిత్రీకరించే ప్రయత్నం జరగుతుండడాన్ని పాత్రికేయులు నిశ్చితంగా గమనించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసరాజు, రాజ్యాంగబద్ధ సంస్థల్లో ఒకటైన మీడియా తన పాత్ర, నేటి వర్తమాన పరిస్థితితుల్లో మరింత సమర్థంగా పోషించాల్సి ఉందన్నారు. మీడియాపైనే ప్రజాస్వామిక మనుగడ ఆధారపడి ఉందని, ఆ దిశగా పాత్రికేయులు తమవంతు బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలని కోరారు. ఈ సందర్భంగా పత్రిక రంగంలో విశిష్ట సేవలందించి అవార్డులు దక్కించుకున్న వారికి మంత్రుల చేతుల మీదుగా వాటిని అందజేశారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

పొంగిపొర్లుతున్న కృష్ణా, తుంగభద్ర

రాయచూరు, జూలై 28: 'దో అబ్'గా పేరున్న రాయచూరు జిల్లా సరిహద్దులను ఆనుకుని ప్రవహిస్తున్న రెండు జీవనదులు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణ-తుంగభద్ర నదుల్లో పెరిగిన ప్రవాహంతో నది తీర గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. కృష్ణనదిలో 3 లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండడంతో ఇప్పటికే పలు లంక గ్రామాల ప్రజలు నది మధ్యలోనే చిక్కుకుపోగా లోతట్టుగా ఉన్న రెండు వంతెనలు నీట మునిగిపోవడంతో పలు నడిగడ్డ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పాటు కృష్ణనది తీరంలో ఉన్న పలు గ్రామాలకు చెందిన రైతుల పంప్‌సెట్‌లు వరదలో కొట్టుకుపోవడంతో అధికారులకు ఫిర్యాదులు అందాయి. మరోవైపు తుంగభద్ర నదిలో 1.80 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా ఆదివారం ఎలె బిచ్చాలీ శ్రీగురు రాయుల పూజకట్ట మందిరం నీట మునుగుతున్నట్లు అక్కడి పూజారులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

టీపీ కైలాసం (జయంతి)



తంజావూరు పరమశివ అయ్యర్ (టీపీ) కైలాసం 1884 జూలై 29న మైసూరులో జన్మించారు. రచయిత, సాహితీవేత్త. హాస్యంతో కూడిన ఎన్నో నాటకాలు రాశారు. సమాజంలోని సమస్యలపై ఆయన నాటకాలలో ప్రస్తావించేవారు. ఆంగ్లం నుంచి కన్నడలోకి అనువాదం చేశారు. 'కర్ణాటక ప్రహసన పితామహ, కన్నడక్కె ఒబ్బనె కైలాసం' బిరుదులు పొందారు. తర్ఫీదు పొందిన జియాలజిస్ట్, క్రీడాకారుడు, నటుడిగాను రాణించారు. మద్రాస్‌లో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. 1946 నవంబరు 23న కన్నుమూశారు.

సినారె (జయంతి)




సినారెగా పేరొందిన సింగిరెడ్డి నారాయణరెడ్డి 1931 జూలై 29న కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా)లో హనుమాజీ పేటలో జన్మించారు. తెలుగు కవి, సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన ఎనలేని సేవలకుగాను 1988లో 'విశ్వంభర' కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం లభించింది. పద్య కావ్యాలు, గేయాలు, వచన కవితలు, గద్య కృతులు, సినిమా పాటలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, బుర్రకథలు, గజళ్ళు తదితర రచనలు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2017 జూన్ 12న కన్నుమూశారు.

బిడారం కృష్ణప్ప (వర్ధంతి)



బిడారం కృష్ణప్ప 1866 సెప్టెంబరు 1న జన్మించారు. కొంకణి మాట్లాడే కుటుంబంలో ఉడుపి జిల్లా నందలికె గ్రామంలో జన్మించారు. 19వ యేట మైసూరు మహారాజ ప్యాలెస్‌లో కర్ణాటక సంగీత కారుడిగా గుర్తింపు పొందారు. ఆయన ప్రతిభకు తాళ బ్రహ్మగాను, గాన విశారద, శుద్ధ శివాచార్య, పల్లవి కృష్ణప్ప తదితర బిరుదులు పొందారు. ప్రత్యేకించి కన్నడలో దేవరనామాలు పాడడంలో పేరొందారు. 1931 జూలై 29న కన్నుమూశారు.

వెంపటి చినసత్యం (వర్ధంతి)



భరతనాట్యానికి సమానంగా కూచిపూడి ఖ్యాతిని చాటిన వెంపటి చినసత్యం 1929 అక్టోబరు 15న కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించారు. భరత నాట్యమే విరాజిల్లుతున్న తరుణంలో కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని చెన్నై కళాభిమానులకు పరిచయం చేసి దీటైన స్థానాన్ని సంపాదించి పెట్టారు. నృత్య నాటికలను ఎన్నో రూపొందించి విదేశాలలో ప్రదర్శించి వాటికి విశేష ఆదరణ కల్పించారు. చెన్నైలో కూచిపూడి ఆర్ట్ అకాడమీని స్థాపించి ఎంతోమందికి తర్ఫీదు ఇచ్చారు. 1984లో అమెరికా పిట్స్‌బర్గ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆస్థాన నాట్యాచార్యుడిగా పనిచేశారు. 2011లో హైదరాబాద్‌లో 2,800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి కార్యక్రమానికి గిన్నిస్ రికార్డుగా నిలిచింది. 2012 జూలై 29న కన్నుమూశారు.

జయప్రభ (పుట్టినరోజు)



ప్రముఖ స్త్రీవాద రచయిత్రిగా పేరొందిన జయప్రభ 1957 జూలై 29న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జన్మించారు. విద్యాభ్యాసం విశాఖపట్నంలో గడిచింది. తెలుగు సాహిత్యంలో ఎంఏ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు నాటకంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారు. లోహిత అనే పత్రికకు కొండవీటి సత్యవతితో కలిసి సంపాదకత్వం వహించారు. ఆమె కవిత్వాన్ని మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు 'అన్‌ఫర్‌సీన్ అఫెక్షన్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో ఆంగ్లంలోకి అనువాదం చేశారు. ఆమె రచనలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి.

నీవు లేక నేను లేను !

తమ్ముడి మృతిని తట్టుకోలేక అన్న ఆత్మహత్య



గుండె పోటుతో మృతిచెందిన బలరాముడు (ఫైల్)



ఆత్మహత్య చేసుకున్న చంద్ర (ఫైల్)

యాడికి, జూలై 28: తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అన్న దాసరి చంద్ర (58) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో జరిగింది. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన దాసరి చంద్ర, దాసరి బలరాముడు అన్నదమ్ములు. ఇద్దరూ వేర్వేరుగా నివసిస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కష్టసుఖాల్లో అన్నదమ్ములిద్దరూ ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. ఈ నెల 26న దాసరి బలరాముడు గుండె పోటుతో మృతిచెందాడు. తమ్ముడి మరణాన్ని జీర్ణించుకోలేక దాసరి చంద్ర విలవిలలాడిపోయాడు. తమ్ముడి అంత్యక్రియలకు వెళ్లాడు. అయితే ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఎక్కడికో వెళ్లి ఉం టాడు.. వస్తాడులే అని కుటుంబ సభ్యులు భావించారు. ప నుల కోసం ఆదివారం ఉదయం తోట వద్దకు వెళ్లారు. అక్క డ చెట్టుకు ఉరివేసుకుని ఉన్న దాసరి చంద్రను గమనించి బోరున విలపించారు. తమ్ముడి మరణాన్ని తట్టుకోలేకనే దా సరి చంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నా రు. దాసరి చంద్ర కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

శిడ్లఘట్ట, జూలై 28: తాలూకాలోని మేలూరులోని గంగాదేవి ఆలయంలో చండీయాగం మూడురోజులపాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. గంగాదేవి భక్తమండలి, ధర్మకర్త ట్రస్టు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాల్గో వార్షిక నవచండికా యాగం జరిగింది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో గంగపూజ, ఆలయ ప్రవేశ పుణ్యాహ, మూలవిరాట్టు ప్రార్థన, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, హోమం, దుర్గాపూజా, ఉమా మహేశ్వరస్వామికి రుద్రపారాయణ, సౌమ్యచన్నకేశవస్వామికి విష్ణుసహస్రనామ పారాయణ, బలిప్రదానం, మహామంగళారతి నిర్వహించారు. శనివారం గోపూజ, నవగ్రహపూజ, నవ చండికా హోమం, దీపారాధన, పూర్ణాహుతి, కలశపూజ, కార్యక్రమాలు సాగాయి. మంగళూరు కటీలు దుర్గాపరమేశ్వరి ఆలయ అర్చకులు వెంకటరామ్ బృందంచే గణపతిపూజ, గంగపూజ జరిగింది. కాశీనుంచి విచ్చేసిన మోహిత్ ఉపాధ్యాయబృందంచే అమ్మవారికి తొలిసారిగా గంగా హారతి నిర్వహించారు. ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గంగాహారతిని వీక్షించి పునీతులయ్యారు. మూడురోజుల కార్యక్రమాలను థణిసంద్ర రామచంద్రప్ప కుటుంబీకులు, దివంగత మేలూరు రామదాస్ కుటుంబీకులు, మేలూరు గ్రామస్థులు పర్యవేక్షించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాసోహం నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు బేజిగౌడ, రామకృష్ణప్ప, అశ్వత్థప్ప, సుదర్శన్, ఎన్ఎల్ఎన్ మూర్తి, ధర్మేంద్రకుమార్, ప్రభాకర్, రూపేశ్, సుధీర్, ఆనంద్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్, ఉపాధ్యక్షుడు శివానంద, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

నిధులు దుర్వినియోగంపై నిందితులకు శిక్ష పడాలి



ప్రతిభా పురస్కారంలో ప్రముఖులు

బాగేపల్లి, జూలై 28: ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి కేటాయించిన నిధులను దుర్వినియోగం చేయడం, అవినీతి క్షమించరాని అంశమని నిందితులకు శిక్ష పడాల్సిందేనని రాజనహళ్ళికి చెందిన వాల్మీకి మహాసంస్థానానికి చెందిన ప్రసన్నానందపురి స్వామిజీ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని సూర్య కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం వాల్మీకి నాయక ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 17వ వార్షిక ప్రతిభా పురస్కారం, సన్మాన కార్యక్రమానికి సాన్నిధ్యం వహించారు. ఎస్సీ, ఎస్టీలు సమాజంలో వెనుకబడినవారని వీరికోసం రాజ్యాంగంలోనే ఎన్నో ప్రాధాన్యత సంక్షేమానికి వీలు కల్పించారన్నారు. రాజ్యాంగబద్ధమైన గ్రాంట్లలో అవినీతి చోటు చేసుకోవడం విచారకరమన్నారు. ఈ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదన్నారు. అగ్నిమాపక, అత్యవసర సేవల పోలీసుశాఖ అధికారి రవి డి చన్నణ్ణవర్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు చెందినవారు కూడా ఐఏఎస్, ఐపీఎస్, కేపీఎస్ వంటి హోదాలలో రాణించాలని అభిలషించారు. మహనీయుల జయంతి ఆచరిస్తే చాలదని వారి ఆశయాలను అలవరచుకోవాలన్నారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని అందుకు వివిధ సంఘాలు పిల్లల ప్రగతికి సహకారం అందిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, భూకబ్జా ప్రత్యేక కోర్టు కమిటీ సభ్యుడు నాగలింగనగౌడ, పశుసంవర్ధకశాఖ రిటైర్డు డైరెక్టర్ డాక్టర్ బీఎన్ శివరాం, రిటైర్డు ఉపవిభాగాధికారి కెఎన్ రామాంజినప్ప, వాల్మీకి నాయక క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు మరియప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వెయ్యి బైక్‌లతో ఉత్సాహంగా ర్యాలీ

- వినూత్నంగా కార్గిల్ విజయోత్సవం

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని వెయ్యి బైక్‌లతో జాథా నిర్వహించి సాధక సైనికులకు గౌరవం సమర్పించారు. మాణిక్ షా పరేడ్ మైదానంలో అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం, ప్రియాకృష్ణ ఫౌండేషన్, శ్రీపార్ సొసైటీ, ఏ7 ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో 25వ కార్గిల్ విజయ్‌దివస్‌ను ఆదివారం ప్రత్యేకంగా బైక్, జీప్ జాథా నిర్వహించారు. మాణిక్ షా పరేడ్ నుంచి సైనికులు, మాజీ సైనికులు, బైకర్‌లు, జీపర్‌లతో సవారిగా గోవిందరాజనగరలోని బీజీఎస్ క్రీడామైదానంలోకి చేరడంతో ర్యాలీ ముగిసింది. ఎమ్మెల్యేలు ఎం కృష్ణప్ప, ప్రియాకృష్ణ, మేజర్ జనరల్ మాథ్యూ, బ్రిగేడియర్‌లు ఆర్ఎస్ బుద్ధహార్ రంజిత్ ఆళ్వా, కల్నల్ పునీత్‌కుమార్ భారద్వాజ్, వెటరన్ కల్నల్ అవిన్ ఉత్తయ్య, అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్‌కే శివణ్ణ జాథాకు పచ్చజెండా చూపారు.

విధానసౌధ వద్ద బైక్ ర్యాలీ



ముడా అవినీతిపై 3 నుంచి చలో మైసూరు

- పాదయాత్రల కాలం...
- వాల్మీకి అక్రమాలపై బాగల్కోటె నుంచి చలో బళ్లారి

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాదయాత్రల కాలం ఆరంభమవుతోంది. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటిస్థలాల అక్రమాలకు పాల్పడిన సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలనే డిమాండ్‌తో బీజేపీ, జేడీఎస్‌లు సంయుక్తంగా పాదయాత్రకు సిద్ధమయ్యారు. ఆగస్టు 3నుంచి పాదయాత్ర జరపాలని తీర్మానించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నేతలు యడియూరప్ప, కేంద్రమంత్రులు కుమారస్వామి, ప్రహ్లాద్ జోషి, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామితోపాటు ముఖ్య నేతలు అందరూ పాల్గొన్నారు. అనంతరం పాదయాత్ర వివరాలను విజయేంద్ర మీడియాకు తెలిపారు. ఆగస్టు 3నుంచి బెంగళూరులో పాదయాత్రను ప్రారంభిస్తామని, ఏడు రోజులపాటు పాదయాత్ర సాగుతుందని, పదో తేదీ శనివారం మైసూరులో బహిరంగ సభ జరుపుతామన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో అవినీతి ఆరోపణలతో కూరుకుపోయిందన్నారు. కేంద్రమంత్రులు పాదయాత్రలో భాగస్వామ్యులు అవుతారన్నారు.

వాల్మీకి అక్రమాలపై బాగల్కోటె నుంచి చలో బళ్లారి

కాగా వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 187 కోట్ల రూపాయల అవినీతిని నిరసిస్తూ బాగల్కోటె జిల్లా కూడలసంగమ నుంచి బళ్ళారి దాకా పాదయాత్ర చేస్తామని బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి వెల్లడించారు. బెళగావి జిల్లా గోకాక్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వాల్మీకి కార్పొరేషన్ నిధులు అందరికీ తెలిసే అవినీతి జరిగిందన్నారు. దేశంలో ప్రముఖులకు నగదు చేరిందని వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలకోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే నిజమైన లబ్ధిదారులకు అందకుండా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని కో-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాలకు కోట్లాది రూపాయల నగదు మళ్ళించేశారన్నారు. పార్టీ సీనియర్ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్‌తో కలసి పాదయాత్ర కార్యా టచరణ చేస్తున్నామన్నారు. పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్రమంత్రి కుమారస్వామిని కలిశానన్నారు. ఆయన డీకే శివకుమార్‌ను సీడీ శివు అంటూ సంబోధించారన్నారు. పాదయాత్రల పర్వం ఎలా కొనసాగనుందో వేచి చూడాలి.

ఉత్సాహంగా కావడి ఊరేగింపు

దొమ్మసంద్ర, జూలై 28: ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని షణ్ముఖ కావడి ఊరేగింపు ఆదివారం జరిగింది. రాజేశ్ అనే భక్తుడు రథాన్ని వీపునకు కొక్కీల ద్వారా తగిలించుకుని ఊరేగారు. పురవీధులలో హరోహర అంటూ సాగడంతో భక్తులు స్వాగతించారు. సుబ్రమణ్య (మురుగన్) ఆలయాన్ని మూడుసార్లు ప్రదక్షిణ చేసి కావడిని దేవుడికి సమర్పించారు. పలు చోట్ల కావడి ఊరేగింపులు కొనసాగుతున్నాయి. భక్తులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పురవీధులలో ఊరేగింపు ఇలా...

బ్రాహ్మణులు సంఘటితం కావాలి

చిక్కబళ్ళాపుర, జూలై 28: జిల్లాకేంద్రమైన చిక్కబళ్ళాపురలో ఆదివారం బ్రాహ్మణ మహాసభ సమ్మేళనం జరిగింది. త్రిమతస్థుల వర్గానికి చెందిన ప్రముఖుల చిత్రపటాలతో ఊరేగింపు సాగింది. జిల్లాలోని వివిధ తాలూకాలనుంచి బ్రాహ్మణ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. సమ్మేళనానికి విచ్చేసిన సభ్యుల అభిప్రాయాలు, సాధకబాధకాలు ఆలకించారు. సమస్యల పరిష్కారానికి మరింత సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సుమారు 50మంది వృద్ధ దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. రాజేంద్రప్రసాద్, అశోక్ జైసింహా, మంజునాథస్వామి, ఎన్ కుమార్, వాసుదేవరావు, శ్రీనాధ్, నాగభూషణరావు, డాక్టర్ సుధాకర్, ప్రకాశ్ రావు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ప్రముఖులు

ఉర్రూతలూగించిన కె-పాప్ పోటీలు

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కె-పాప్ పోటీల్లో భాగంగా బెంగళూరు ప్రాంతీయ విభాగంలో 30 జట్లు పాల్గొని ఉర్రూతలూగించాయి. శనివారం రాత్రి జెపినగర్‌లోని ఎంఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పోటీలు సాగాయి. కె-పాప్ స్టార్‌లు 20 నిమిషాలపాటు ఫీల్ ది పవర్, లవ్ ఈజ్ రైట్, జిమ్మీ జిమ్మీ, డ్రీమర్స్ ఔవా ఔవా విభాగాలలో డ్యాన్సులతో సందడి చేశారు. ఇక్కడ విజేతలుగా నిలిచినవారిని అక్టోబరులో ఢిల్లీలో జరిగే సెమీ ఫైనల్స్‌కు అర్హులవుతారు. నవంబరులో ఫైనల్స్ న్యూఢిల్లీలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రాంతీయ పోటీలు కోల్కత్తా, ఇటానగర్, ముంబై, చెన్నై, హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో నిర్వహించడం ద్వారా 300 జట్లను భాగస్వామ్యులు చేస్తున్నారు. ఇందులో భాగంగా బెంగళూరులో పోటీలు జరిగాయి.



పోటీలో ఓ నృత్య సన్నివేశం

అమలుకాని కాంగ్రెస్ హామీలు



హోబళి స్థాయి బీజేపీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

శిడ్లఘట్ట, జూలై 28: రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ ఆరోపించారు. పట్టణంలోని మయూర సర్కిల్‌లోని బీజేపీ సేవాసౌధ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటైన హోబళి స్థాయి సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు ఒకటి అమలు చేస్తున్నది మరొకటి అని ఆరోపించారు. గ్యారెంటీల పేరిట ప్రజలకు టోపీ వేస్తోందన్నారు. గత శాసనసభ ఎన్నికల వేళ పది అంశాలను ఓటర్లకు హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఐదు గ్యారెంటీలను అమలు చేసేందుకు పెట్రోల్, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, ఇళ్లు, భూముల రిజిస్ట్రేషన్ పన్నును భారీగా పెంచారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచారని, ఇక బస్సు చార్జీలు పెంచేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఈ అంశాలను ఓటర్లు అర్థం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలు సమాజంలోని అట్టడుగు వ్యక్తికి కూడా చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప, రూరల్ హోబళి అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ, నగరసభ సభ్యుడు నారాయణస్వామి, సురేంద్రగౌడ, కనకప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయిలో నగదు బదిలీ

- విజయేంద్ర అవినీతిని త్వరలో బహిర్గతం చేస్తా
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పరిణితి లేని రాజకీయ నేత అని, అతడి అక్రమాలు బీజేపీవారికి కూడా తెలుసని, అంతర్జాతీయస్థాయిలో నగదు బదిలీతోపాటు యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు ఏం చేశారనేది త్వరలోనే బహిర్గతం చేస్తానని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యడియూరప్ప ఎందుకు సీఎం పదవికి రాజీనామా చేశారని ప్రశ్నించారు. విజయేంద్ర అంతర్జాతీయ స్థాయిలో నగదు బదిలీ వ్యవహారాన్ని త్వరలోన వెల్లడిస్తానని అన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతితో రాహుల్‌గాంధీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. ముడా అక్రమాలతో ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధమే లేదని, కేవలం రాజకీయం చేయడానికే విమర్శలు చేస్తున్నారని అన్నారు.

కుమారస్వామికి ముక్కు నుంచి రక్తం

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామి జేడీఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న వేళ ముక్కునుంచి రక్తం వచ్చింది. త్వరలో నిర్వహించే పాదయాత్రకు సంబంధించి ఆయన మాట్లాడుతుండగానే ముక్కులోనుంచి రక్తం వచ్చింది. టవల్‌తో తుడుచుకున్నా ఆగకపోవడంతో కొడుకు నిఖిల్ వెంటనే అక్కడనుంచి జయనగర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

రెండు జడలతో రాలేదని...

విద్యార్థిని జుట్టు కత్తిరించిన టీచర్

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రెండు జడలతో స్కూల్‌కు రాలేదని ఉపాధ్యాయురాలు ఏకంగా జుట్టు కత్తిరించిన సంఘటన రామనగర జిల్లా చన్నపట్టణ తాలూకా అరళాళసంద్ర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకుంది. శుక్రవారం తొమ్మిదో తరగతి విద్యార్థిని రెండు జడలు వేసుకుని పాఠశాలకు రాలేదని గెస్ట్ టీచర్ పవిత్ర సదరు బాలిక జుట్టు కత్తిరించారు. శనివారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వివాదం తీవ్రమవుతుండడంతో ప్రాంతీయ విద్యాశాఖాధికారి మరిగౌడ పాఠశాలను సందర్శించారు. విద్యార్థిని తల్లి దండ్రులను సముదాయించారు. టీచర్ పవిత్ర క్షమాపణలు చెప్పారు. నాకు ఎటువంటి దురుద్దేశ్యం లేదని క్షమాపణలు చెప్పారు. పవిత్ర అరళాళసంద్ర పీయూ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భార్యగా తెలిసింది. ఆమె తీరు పట్ల గ్రామస్థులు మండిపడ్డారు.

కావడి ఉత్సవ సన్నాహాలకు అంతరాయం



గ్రామస్థులు, పోలీసుల మధ్య వాగ్వాదం

బంగారపేట, జూలై 28: తాలూకాలోని కామసముద్ర హోబళి దొడ్డపొన్నాండహళ్ళిలో శనివారం రాత్రి కావడి ఉత్సవం నేపథ్యంలో సాగుతున్న భజన కార్యక్రమాన్ని ఆపేయాలంటూ పోలీసులు సూచించారు. దీంతో పోలీసులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈనెల 30, 31 తేదీలలో కావడి ఉత్సవానికి సంబంధించి భజనలు, నృత్యం తర్ఫీదుకు సంబంధించి పోలీసులు బ్రేక్ వేశారు. రాత్రి 10 గంటల తర్వాత బిగ్గరగా శబ్దం వచ్చేలా లౌడ్ స్పీకర్‌లు, వాద్యాలు వాడరాదని సూచించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. కావడి జాతరలో వాహనాలపై వేలాడడం, నాలుకకు త్రిశూలం వంటివి గుచ్చుకుని వెళ్లరాదని పోలీసులు సూచించారు.

1న 'కాగె దోష' నాటకం

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పరువు ప్రతిష్టలు, ఏ విధంగా సర్దుబాట్లు చేసుకోవచ్చుననే కోణంలో రూపొందించిన 'కాగె దోష' నాటకం నగరంలోని రంగశంకరలో ఆగస్టు 1న నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరులో నివసించే ఓ కుటుంబ పెద్ద దూరమైతే ముంబైలో ఉద్యోగం చేసే కుమారుడు, తల్లిల మధ్య సాగే పయనం నాటకం రూపంలో తెలిపారు. ప్రఖ్యాత నాటకకారుడు హెన్రిక్ ఇబ్సన్ ఘోస్ట్ నాటకంలోని ఓ భాగాన్ని 2012లో వాస్తవ సంఘటనలను ఆధారంగా అనుపమ చంద్రశేఖర్ 'వెన్ ది క్రోస్ విజిట్' పేరిట నాటకాన్ని రచించారు. వెంకటేశ్ ప్రసాద్ కన్నడలో కాగె దోష నాటికన రాత్రి 7.30 గంటలకు ప్రదర్శిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వచ్చీరాని వైద్యంతో అనర్థాలు : ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

హిందూపురం అర్బన్, జూలై 28: వచ్చీ రానివైద్యం చేసి అనర్థాలను సృష్టించవద్దని శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆర్ఎంపీ వైద్యులకు సూచించారు. ఆదివారం స్థానిక అల్ హిలాల్ పాఠశాలలో ఆర్ఎంపీల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, యాంటీ బయాటిక్స్ వేయరాదన్నారు. వైద్యం పూర్తిగా తెలియకపోవడంతో రోగుల ప్రాణాలు పోతాయని, అత్యవసర సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు పంపాలన్నారు. ఇటీవల కొక్కంటి ప్రాంతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దన్నారు. అత్యవసర సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రికి, ఇతర అర్హతలు ఉన్న వైద్యుల వద్దకు పంపాలన్నారు. కొంత మంది అన్ని రకాల వైద్యం అందుతుందని, చిన్న పిల్లలకు ప్రత్యేకంగా చూడబడునని బోర్డులు వేసుకొని ఉంటారన్నారు. వాటిని తొలగించాలని కేవలం ప్రథమ చికిత్సాకేంద్రాలు అని మాత్రమే రాసుకోవాలన్నారు. ఆర్ఎంపీ కేంద్రా ల్లో సెలెన్ బాటిల్లతోపాటు, బెడ్లు, స్టాండ్‌లు, మంచాలు, ఉండకూడదని, ఇంజక్షన్ వేయరాదని ప్రసవాలు చేయకూడదని, అబార్షన్ లాంటివి అసలు చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మజ, మాధుర్య, జిల్లా మాస్ మీడియా అధికారి బాబా ఫక్రుద్దీన్, ఆర్ఎంపీలు సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు తదితరులు ఉన్నారు.